సంచలన సాయంకాల పత్రిక
సత్యం
https://www.satyamdaily.net/
గురువారం 19-12-2024
సంపుటి: 20 సంచిక: 226
పేజీలు: 4 వెల: రూ.1

# భారత్ పెట్రోల్ బంక్‌లో మంటలు

(సత్యంన్యూస్, టెక్కలి)

గురువారం ఉదయం స్థానిక పాత జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఎస్-ఎల్ఆర్ కల్యాణమండపం ఎదురుగా ఉన్న భారత్ పెట్రోలియం బంక్‌లో అగ్ని మంటలు అకస్మాత్తుగా చెలరేగాయి. దీంతో బంక్ సిబ్బంది భయంతో పరుగులు తీశారు. పక్కనే ఇంకొక పెట్రోల్ ట్యాంక్‌ను పనులు జరుగున్న సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయిందని బంక్ సిబ్బంది తెలిపారు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వచ్చి మంటలను అదుపులోకి వచ్చాయి.





• ఎడిటోరియల్

## తాజ్‌మహల్ అంటే మీరే ఉస్తాద్..!

ఆసుపత్రి నుంచి ఇంటికి తీసుకొచ్చినప్పుడు ముస్లిం సంప్రదాయం ప్రకారం తండ్రి కొడుకు చెవిలో 'కల్మా' చదివి, పేరు పలికి లోపలికి తీసుకెళ్లాలి. 'నేను స్కూల్‌కు వెళ్లే దారిలో చర్చిలో సంగీతం వినేవాణ్ణి. గుడిలో వినిపించే భక్తి గీతాలు ఆలపించేవాణ్ణి. ప్రపంచంలో ఏ మతమూ ఇంకో మతంపైన జబర్దస్తీ చేయదు. ఏ మతమైనా చెప్పేది నీ పొరుగు వారిని ప్రేమించు' అనే చెబుతుందని భావించే ఉస్తాద్ అల్లా రఖా తన కొడుకు చెవిలో తబలా జతులు వినిపించాడట. ఇదేమిటని భార్య ప్రశ్నిస్తే.. 'నా ప్రార్థనలు ఇవే.. నేను ప్రార్థన చేసే విధానం ఇదే' అన్నాడట. తనకు గురువుల నుంచి సంక్రమించిన జ్ఞానాన్ని కొడుకుకు పంచాలన్న ఆయన తపన.. తండ్రికి మాట రాకూడదన్న పట్టుదల జాకీర్‌ను జగద్విఖ్యాతం చేశాయి. మూడేళ్లకే తబలాను మీటిన ఆ పసివేళ్లు.. ఏడేళ్లకే అకుంఠిత దీక్షతో సాధన చేశాయి. పన్నెండేండ్లకే ప్రదర్శనలిచ్చాయి. అన్ని మతాలు, అన్ని ధోరణుల విద్వాంసులతో అతి సులువుగా కలిసిపోయి తన తబలాను వారి సంగీతానికి జత చేయగలగడం జాకీర్ ప్రతిభకు, సర్వ మత సారం ఒక్కటేనన్న ఆధ్యాత్మిక భావనకు తార్కాణం. తన మహోన్నత ప్రతిభా పాటవాలతో దేశ విదేశాల్లో కోట్లాది మంది మనసుల్ని గెలుచుకున్న సంగీత భానుడు అస్తమించాడు. భారత శాస్త్రీయ వాయిద్య కళను ప్రపంచానికి చేరువ చేసిన మ్యూజిక్ మాస్ట్రో, తబలా వాయిద్య మాంత్రికుడు ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ నిష్క్రమణతో తబలా మూగబోయింది. తోడు వాయిద్యంగా ఉన్న తబలాకు ప్రత్యేక గుర్తింపుతెచ్చిన అద్వితీయ ప్రతిభావంతుడు ఇకలేరన్న వార్త ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంగీత ప్రియులను శోకసంద్రంలో ముంచింది. ఆల్‌టైం గ్రేట్ తబలా విద్వాంసుడిగా పేరొందిన ఉస్తాద్ అల్లారఖా ఖాన్ కుమారుడైన జాకిర్ హుస్సేన్ అల్లారఖా ఖురేషికి పసిబిడ్డగా ఉన్నప్పుడే తబలాతో ఏర్పడిన అనుబంధం, అంతకు మించిన అకుంఠిత దీక్ష, అద్వితీయ ప్రతిభ.. ఆయన్ను సంగీత ప్రపంచంలో శిఖరాగ్రాన నిలిపాయి. శాస్త్రీయ వాయిద్య కళాకారులకిచ్చే బిరుదైన 'ఉస్తాద్' అని కాకుండా.. జాకీర్ బారు అని పిలవాలని కోరుకోవడం ఆయన వినమ్రతకు, విశ్వమానవ సౌభ్రాతృత్వానికి నిదర్శనం. 1989లో ఢిల్లీలో ప్రముఖ నాటక రచయిత సఫ్దర్ హష్మీని కాంగ్రెస్ గూండాలు హత్య చేసినప్పుడు ఆయన సృజనాత్మకంగా నిరసన తెలిపారు. కుల, మతాలకు అతీతంగా అందరినీ ప్రేమించారు. తన స్నేహితుడైన ప్రముఖ సంతూర్ విద్వాంసుడు శివకుమార్ 2022లో మరణించినప్పుడు భౌతికకాయాన్ని భుజాలపై మోసి ప్రేమ చాటుకున్నారు. అందరూ వెళ్లిపోయినా చితిపక్కన విచారంగా నిలబడి కన్నీళ్లు పెట్టుకున్న ఫొటోలు వైరల్‌గా మారాయి. 'ఇదీ నిజమైన ఇండియా.. స్నేహానికి కుల, మత భేదాలు లేవు' అన్న నెటిజన్ల వ్యాఖ్యలు అక్షర సత్యం కదా! అందుకేనేమో క్రిస్టియన్ అయిన కథక్ నృత్యకారిణి ఆంటోనియా మిన్నెకోలాను వివాహం చేసుకున్నారు. తండ్రి అల్లారఖాకు అనారోగ్యం కారణంగా 19 ఏళ్ల వయసులో తొలిసారి అమెరికా వెళ్లి పండిట్ రవి శంకర్‌కు సహవాయిద్యం అందించే అవకాశం దక్కింది. ఆయనతో పాటు అలీ అక్బర్ ఖాన్, భీమ్‌సేన్ జోషి, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, శివకుమార్ శర్మ వంటి భారతీయ సంగీత ప్రముఖులతోనే కాక అంతర్జాతీయ దిగ్గజాలందరితోనూ చేసిన జుగల్ బందీలు అజరామరంగా నిలిచాయి. పలు సినిమాలకు సౌండ్ ట్రాక్స్ అందించడం, నటించడమే కాకుండా.. మిస్టర్ అండ్ మిసెస్ అయ్యర్ వంటి చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించారు. 'వాహ్ తాజ్' వంటి ప్రకటనలతో దేశంలో ప్రతి ఇంటికీ చేరువయ్యారు. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మ విభూషణ్, సంగీత నాటక అకాడమీ, గ్రామీ వంటి లెక్కలేనన్ని పురస్కారాలను అందుకున్నారు. హిందూ, ముస్లిం శాస్త్రీయ సంగీత భాగస్వామ్యాన్ని స్థిరంగా ప్రచారం చేయడంతో పాటు కొనసాగాలని కోరుకున్న కళాస్రష్ట. గాత్రసంగీతమైనా, వాయిద్య సంగీతమైనా, జుగల్ బందీ అయినా, వ్యక్తిగత ప్రదర్శన ఇచ్చినా, ఫూజన్ అయినా.. తనదైన శైలిలో రక్తికట్టించే ఆయన తబలా వాయిద్యం.. గాలిలో ఊగే గుబురు జుత్తు.. జనం కళ్లలో ఎప్పుడూ కదలాడుతూనే ఉంటాయి. వచ్చే ఏడాది ముంబైలో వరుసగా సంగీత కచేరిలిచ్చేందుకు సిద్ధమైన ఆ బహుముఖ ప్రజ్ఞాశాలి ఇంతలోనే అస్తమించడం సంగీత ప్రపంచానికి తీరని లోటు. సంగీతానికి భాష అంటూ ఉంటే అది ప్రేమ, ఐక్యత అని చాటిచెప్పిన జాకీర్ బారు ఎన్నటికీ సంగీత ప్రపంచంలో మకుటాయమానంగా వెలుగొందుతూనే ఉంటారు. కొత్త వెలుగులను అన్వేషించే భావి తరాలకు స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తారు. తాజ్‌మహల్ టీ గురువారం జాతీయ పత్రికలకు ఇచ్చిన ప్రకటన చూస్తే ఉస్తాద్ ఏంటో ఈ జనరేషన్‌కు అర్థమవుతుంది. 100 కోట్ల భారతీయులను తాజ్‌మహల్ టీ కోసం విన్నప్పుడు మీకేం గుర్తొస్తుందంటే.. తాజ్‌మహల్ కాదు.. ఉస్తాద్ జాకీర్ హుస్సేనే అని ప్రకటించడం అతిశయోక్తి కాదు.

## ఘనంగా పేదల క్రిస్మస్ సంబరాలు

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

ఆముదాలవలస మున్సిపాలిటీ నాలుగో వార్డ్ గేదెల వానిపేట జంక్షన్లో అరుణోదయ, సీక్ అండ్ సేవ్ సేవా ఫౌండేషన్ బెంగళూరు వారి ఆధ్వర్యంలో గీత కార్మికుల మధ్య ఏర్పాటు చేస్తున్న పేదల క్రిస్మస్ సంబరాలు అధ్యక్షులు రెవరెండ్ పాస్టర్ శామ్యూల్ అరుణ్ కుమార్ వారి ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ శ్రీనివాస పట్నాయక్ పాల్గొన్నారు శాంతి ప్రేమ కరుణ ప్రత్యేకంగా క్రిస్మస్ సమాజంలో అట్టడుగుల స్థాయిలో ఉన్న బలహీన ఉన్న ప్రజలను బలవృద్ధం చేయడానికి సర్వ మానవాళి పాప రక్షణకై ఏసుక్రీస్తు ఈ లోకానికి వచ్చారని సందేశం అందించారు. క్రిస్మస్ పాటలు నృత్యాలు ప్రార్థనల ద్వారా ఆ ప్రాంతమంతా మారుమ్రోగింది ప్రేమ విందు అనంతరము పేదలకు వస్త్రాలు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ బొర్ను, అహరోన్ రాజ్, సంసోన్, సువార్త రాజు, రమేష్, సౌమ్య, ధనలక్ష్మి సూర్యనారాయణలు పాల్గొన్నారు.




## అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రపంచ మేథావి నవభారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న, నిమ్నజాతుల ముద్దుబిడ్డ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని జిల్లా దళిత సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు జిల్లాలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ అమిత్‌షా పార్లమెంటు వేదికగా అంబేద్కర్, అంబేద్కర్ అనడం ఫ్యాషన్‌గా మారిందనీ వాళ్ళు అన్నిసార్లు అనడంకంటే దేవుడు పేరు స్మరిస్తే స్వర్గంలో స్థానం దక్కుతుందని చెప్పడం బీజేపీ అసలు రంగు బయట పెడుతుందన్నారు. ఆ పార్టీ ఫాసిస్టు, నియంతృత విధానానికి నిదర్శనమని విమర్శించారు. తక్షణమే కేంద్ర మంత్రి పదవి నుంచి అమిత్ షా ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రపంచంవ్యాప్తంగా ముఖ్యంగా భారతదేశంలో ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుతున్నది అంబేద్కర్ వల్లే అనే వాస్తవాన్ని మర్చిపోకూడదన్నారు. కార్యక్రమంలో సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గణేష్, కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్క క్రిష్ణయ్య, మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి బోనేలా అప్పారావు, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నగర అధ్యక్షుడు కానుకూర్తి గోవింద్, దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా నాయకులు బైరీ ధనరాజ్, సూరిబాబు, ముచ శ్యామ్, అంబేద్కర్ యువ జన సంఘం నాయకులు రాకోటి రాంబాబు, మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేవీ జగన్నాథం, సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కళ్లేపల్లి రాంగోపాల్, బడే కామరాజు, రమేష్, మురళీకృష్ణ, జాన్, ఎడ్ల జనకిరావు, బోసు మన్మదరావు, యజ్జల గురుమూర్తి, బొడ్డేపల్లి భూపతిరావు తదితరులు పాల్గొన్నారు.

### టెక్కలిలో...

టెక్కలిలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు బగాది వాసుదేవరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిటు నాయకులు నంబూరు షణ్ముఖరావు, కె.యన్.పి.ఎస్.నాయకులు, బి.ప్రభాకర్, డిటిఎఫ్ నాయకులు కోత ధర్మారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొల్లి యల్లయ్య, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కె.కామేశ్వరరావు, ఎఐటియుసి నాయకులు అనపాన షణ్ముఖరావు, టీడీపీ ఎస్సీ సెల్ మట్ట పురుషోత్తము, బెల్లాన దాలయ్య, జొన్న సంజీవరావు, కామయ్యలు పాల్గొన్నారు.





## తీరప్రాంత పరిరక్షణకు పటిష్ఠ చర్యలు

- మత్స్యకారులకు అవగాహన కల్పించాలి
- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తీరప్రాంత పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. జిల్లాస్థాయి తీర ప్రాంత భద్రతా కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత సమావేశంలో చర్చించిన అంశాలపై తొలుత సమీక్షించారు. ముందుగా కోస్టల్ పోలింగ్ స్టేషన్స్ ప్రహరీ గోడలకు సంబంధించిన పనులపై పంచాయతీరాజ్ శాఖ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సముద్రతీర ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగే ప్రదేశాల వద్ద గస్తీ ఏర్పాటు చేస్తున్నప్పటికీ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇందుకోసం గజ ఈతగాళ్లను ఏర్పాటుచేయాలని ఎస్.పి కోరారు. వాచ్ టవర్స్ ఏర్పాట్ల పై చర్యలు తీసుకుంటామన్నారు. తీరప్రాంతాల్లో హోర్డింగ్స్, బారువ, కళింగపట్నం ప్రాంతాల్లో లైఫ్ జాకెట్స్, బోట్స్ అవసరమని సభ్యులు కోరగా జిల్లా కలెక్టర్ తదుపరి చర్యలు నిమిత్తం సంబంధిత అధికారులను ఆదేశించారు. సముద్రం వేటకు వెళ్లే మత్స్యకారులు మత్స్యశాఖ జారీచేసే బయోమెట్రిక్ కార్డులు, ఆధార్ కార్డులు తీసుకువెళ్లడంలేదని తెలియజేయడంతో మత్స్యకారులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. సముద్ర తీరంలో జెట్టీలను ఏర్పాటు చేయాలని సభ్యులు కోరగా సంబంధిత పనులపై చర్యలు చేపట్టాలని మత్స్యశాఖ ఉపసంచాలకులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే తీర ప్రాంతంలో ఇంటర్నెట్ సౌకర్యం లేదని సభ్యులు కోరగా, అందుకు సంబంధించిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో కోస్టల్ గార్డ్ ఎస్పీ రవివర్మ, డిజాస్టర్ మేనేజ్ మెంట్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ పి.రాము, మత్స్యశాఖ ఉపసంచాలకులు పి.వి.శ్రీనివాసరావు, సహాయ సంచాలకులు టి.సంతోష్ కుమార్, తీరప్రాంత సీఐలు, ఎస్ఐలు ఇతర అధికారులు పాల్గొన్నారు.







2024 క్యాలెండర్ ముగింపు దశకు వచ్చేసింది. ఇక అంతా 2025లో రాబోయే సినిమాల గురించి లెక్కలేసుకొంటున్నారు. ఏ సినిమా ఎప్పుడు వస్తుంది? ఏ సీజన్‌లో ఏ స్టార్ సందడి చేయబోతున్నాడు? అనే విషయాలపై ఇప్పటి నుంచే ఆసక్తిగా చర్చించుకొంటున్నారు. అయితే 2025 క్యాలెండర్ ఇయర్ అంత సాఫీగా సాగేట్టు కనిపించడం లేదు. ఎందుకంటే రిలీజ్ డేట్ల విషయంలో కాస్త గందరగోళం ఉంది. ఇప్పటికే కొన్ని పెద్ద సినిమాలు 2025 రిలీజ్‌డేట్ల పై కర్చీఫ్ వేశాయి. అయితే ఇప్పుడు ఆ డేట్లు ఇరకాటంలో పడ్డాయి. కొన్ని సినిమాల విడుదలపై సందిగ్ధత నెలకొంది. డేట్లు మారే అవకాశాలూ పుష్కలంగా ఉన్నాయి.

## రిలీజ్ లెక్కలు మారుతున్నాయి!!

'రాజాసాబ్' ఏప్రిల్ 10న రావాలి. అయితే ఈ సినిమా కాస్త ఆలస్యమయ్యే ఛాన్సుంది. అందుకే ఏప్రిల్ 10 పై కొన్ని చిత్రాలు గురి పెట్టాయి. సిద్దు జొన్నలగడ్డ సినిమా 'జాక్' ఏప్రిల్ 10న విడుదల చేస్తామని చిత్రబృందం ప్రకటించింది. 'విశ్వంభర' కూడా ఇదే డేట్ పై దృష్టి పెట్టింది. మే 9న 'విశ్వంభర' విడుదల చేద్దామనుకొన్నారు. ఇప్పుడు కాస్త ముందుకు కదిలే ఛాన్సుంది. ఒకవేళ 'విశ్వంభర' ముందుకు వచ్చేస్తే మే 9న విజయ్ దేవరకొండ సినిమా రావొచ్చు. విజయ్ దేవరకొండ-గౌతమ్ తిన్ననూరి కాంబినేషన్‌లో ఓ చిత్రం రూపుదిద్దుకొంటున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్ని మే 9న రిలీజ్ చేస్తే ఎలా ఉంటుందని చిత్రబృందం ఆలోచనలో పడింది. 'విశ్వంభర' గనుక మే 9న వస్తే విజయ్ సినిమా ప్లానింగ్ లో మార్పు ఉండొచ్చు. మే 9నే రవితేజ సినిమా 'మాస్ జాతర' రావొచ్చన్న ఊహాగానాలు వినిపించాయి. ఇప్పుడు రవితేజ సినిమా కూడా వెనక్కి వెళ్తుంది. 'రాజాసాబ్' ఎప్పుడొస్తుందన్న దాన్ని బట్టి మిగిలిన సినిమాలు ప్లానింగ్ చేసుకొంటాయి. ఏప్రిల్ 10 దాటితే మే 9 మంచి డేట్. ఒకవేళ 'రాజాసాబ్' ఆ డేట్ ఫిక్స్ చేసుకొంటే మిగిలిన సినిమాల రిలీజ్ డేట్లు గందరగోళంలో పడతాయి. ఇలాంటి సందిగ్ధత ఇది వరకు కూడా చాలాసార్లు వచ్చింది. అప్పుడు నిర్మాతలంతా కూర్చుని మాట్లాడుకొన్నారు. ఎవరి సినిమాలు ఎప్పుడొస్తాయి? అవి ఇప్పుడు ఏ దశలో ఉన్నాయి? అనే విషయంలో స్పష్టత వస్తే.. అన్ని సినిమాల రిలీజ్ డేట్లు కుదురుకుంటాయి. లేదంటే ఈ సస్పెన్స్ తప్పదు.




- తెలుగు 360.కామ్ సౌజన్యంతో...

## ముసలి హీరోలతో నటించనని చెప్పా!

**చైల్డ్ ఆర్టిస్టుగా కెరీర్ ప్రారంభించి, హీరోయిన్ గా మారిన ముద్దుగుమ్మలలో కావ్య కళ్యాణ్ రామ్ ఒకరు. 'మసూద' మూవీతో లీడ్ యాక్ట్రెస్ గా పరిచయమైన ఈ తెలుగు బ్యూటీ.. 'బలగం' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. అయితే ముసలి హీరోల పక్కన యాక్ట్ చెయ్యను అని కావ్య ఓ ఇంటర్వ్యూలో చెప్పినట్లు వార్తలు వైరల్ అయ్యాయి. తాజాగా దీనిపై స్పందిస్తూ.. తన వ్యాఖ్యలను వక్రీకరించారంటూ వివరణ ఇచ్చింది.**

కావ్య కళ్యాణ్ రామ్ లేటెస్టుగా ఓ యూట్యూబ్ ఛానల్ ఇంటర్వ్యూలో పలు ఆసక్తికరమైన విషయాలు పంచుకుంది. ఈ సందర్భంగా 'ముసలి హీరోలతో నటించను' అన్నారంట కదా? అని యాంకర్ ప్రశ్నించగా.. "నేను అలా అనలేదు. ఇదంతా ట్విస్టింగ్ టర్నింగ్ అవుతోంది" అని కావ్య సమాధానమిచ్చింది. అల్లు అర్జున్, బాలయ్య సినిమాలలో బాలనటిగా నటిస్తున్నప్పుడు, పెద్దయ్యాక తమ పక్కన హీరోయిన్‌గా యాక్ట్ చేయ మని సరదాగా అడిగేవారని చెప్పింది. అయితే చిన్నతనంలో ఏదో తెలియక ముసలి వాళ్ళతో యాక్ట్ చేయనని అన్నానని చెప్పింది. "చిన్నప్పుడు నేను అల్లు అర్జున్ గారు, బాలకృష్ణ గారితో సినిమాలు చేశాను. ఆ సమయంలో 'నువ్వు ఇప్పుడు చైల్డ్ ఆర్టిస్టుగా చేస్తున్నావ్. పెద్దగా అయిన తర్వాత మా పక్కన హీరోయిన్‌గా చెయ్యాలి' అని నాతో జోక్‌గా అన్నారు. అప్పుడు నేను చిన్న పిల్లని కదా. నాకు ఏమీ తెలియక 'నేను హీరోయిన్ అయ్యే టైముకి మీరు ముసలి వాళ్ళు అయిపోతారు. కాబట్టి నేను మీతో చెయ్యను' అని చెప్పాను. కట్ చేస్తే 20 ఏళ్ల తర్వాత అల్లు అర్జున్ గారు గ్లోబల్ ఐకాన్. ఇప్పుడు ఆయనతో వర్క్ చేయడానికి నేను చచ్చిపోతున్నాను" అని కావ్య తెలిపింది. అల్లు అర్జున్ హీరోగా పరిచయమైన 'గంగోత్రి' సినిమాలో కావ్య కళ్యాణ్ రామ్ చైల్డ్‌ఆర్టిస్టుగా నటించింది. "గంగోత్రి నుంచి పుష్ప వరకూ అల్లు అర్జున్ జర్నీ ఎంతో ఇన్స్పిరేషన్. సినిమా సినిమాకీ ఆయన ఇంప్రూవ్ అవుతూ ఈ స్థాయికి వచ్చారు. అంత పెద్ద ఫ్యామిలీ నుంచి వచ్చి కూడా ఎక్కడా స్తబ్దుగా ఉండలేదు. ప్రతీ సినిమాకి వేరియేషన్ చూపిస్తూ ఏదో కొత్తగా ఇవ్వాలనే తాపత్రయ పడుతుంటారు" అని కావ్య చెప్పింది. "ఇప్పుడు అందరూ పాన్ ఇండియా అంటున్నారు కానీ, నేను పూణేలో చదువుకుంటున్నప్పుడు 'బాహుబలి', 'పుష్ప' సినిమాలు రాకముందే అల్లు అర్జున్‌ని అక్కడ అందరూ గుర్తుపట్టేవారు. అప్పుడే ఆయన డబ్బింగ్ సినిమాలను హిందీ, మలయాళీ జనాలు తెగ చూసేవారు" అని కావ్య తెలిపింది. 'గంగోత్రి' సినిమా టైంలో అల్లు అర్జున్‌తో చాలా ఎంజాయ్ చేశానని చెప్పింది. అరకులో షూటింగ్ జరుగుతున్నప్పుడు బన్నీ, అదితి అగర్వాల్, తేజతో కలిసి చెరకు తోటలకు వెళ్ళామని తెలిపింది. గంగోత్రి సినిమాకి కూడా బన్నీ ఫుల్ డెడికేషన్ తో వర్క్ చేశారని కావ్య చెప్పింది. చిరంజీవి, నాగార్జున, బాలకృష్ణ, పవన్ కళ్యాణ్.. అంత పెద్ద స్టార్స్ అయినా సెట్స్ లో చాలా డౌన్ టు ఎర్త్ ఉండేవాళ్ళని కావ్య చెప్పుకొచ్చింది. 'స్నేహమంటే ఇదేరా' సినిమాతో బాలనటిగా పరిచయమైన కావ్య రామ్.. 'గంగోత్రి', 'ఠాగూర్', 'అడవి రాముడు', 'బాలు', 'బన్నీ', 'లేత మనసులు', 'విజయేంద్ర వర్మ', 'సుభాష్ చంద్ర బోస్', 'పాండు రంగడు', 'ఉల్లాసంగా ఉత్సాహంగా' తదితర సినిమాలతో పేరు తెచ్చుకుంది. 2022లో 'మసూద'తో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత 'బలగం', 'ఉస్తాద్' సినిమాలలో నటించింది.



- తుపాకి.కామ్ సౌజన్యంతో...



# పెళ్లి బరాత్‌లో.. పార్టీ జెండాలా?


*"ఏ కల్యాణం కోసం ఇంతటి కల్లోలం?..*
*నీకు తెలియనిదా నేస్తమా!.. చెంత చేరననే పంతమా?*
*ఖండాలుగ విడదీసే జెండాలన్నీ తలవంచే తలపే అవుదాం..*
*ఆ తలపే మన గెలుపని అందాం"*

అని కంచె సినిమాలో సిరివెన్నెల చెప్పిన సందర్భం సరిహద్దులో యుద్ధానికి సంబంధించినదే అయినా సర్వకాల సర్వావస్థల్లో పాటించాల్సిన హద్దులు చెరిపేసే ఏ సందర్భానికైనా అన్వయమయ్యే విశ్వజనీన ఆదర్శమది. ఆదర్శాలెప్పుడూ మాటల్లో గొప్పగా ఆకాశాన్ని తాకుతూనే ఉంటాయి. చేతల్లో తరచుగా ఓడిపోతూ పాతాళం అంచులు చూస్తూ ఉంటాయి.

ఎవరి అజెండా వారిది- ఎవరి జెండా వారిది అయిన రోజుల్లో జెండా పండుగరోజే జెండాకు విలువ ఉంటుందనుకుంటే పప్పులో కాలేసినట్లే. ఇప్పుడు ప్రతిరోజూ, ప్రతిచోటా జెండా ఉండాల్సిందే.

మనిషి ఇప్పుడు సంఘజీవి అయినా కాకపోయినా రాజకీయ జీవి. మెదడున్న ప్రతి మనిషికి ఒక రాజకీయ సైద్ధాంతిక తాత్విక భావజాలం, కార్యాచరణ ఉన్న రోజులివి. అధికార- ప్రతిపక్ష పార్టీలుగా సామాన్య ప్రజలు చీలిపోయి తాము మౌలికంగా సంఘంలో మనుషులమన్న సామూహిక స్పృహ మరచిపోయిన కాలమిది. కాబట్టి మనమేమిటో, మన పార్టీ ఏమిటో, మన పార్టీ విధానాలేమిటో తెలిసేలా మన ఇంటి మీద పార్టీ జెండా ఎగరాల్సిందే. మన ఇంటి ప్రహరీ గోడకు పార్టీ గుర్తులు వేయాల్సిందే. పార్టీ రంగులు పులమాల్సిందే. గుమ్మానికి మన పార్టీ అధ్యక్షుడి స్టిక్కర్ అతికించాల్సిందే. చేతికి మన పార్టీ పచ్చబొట్టు పొడిపించుకోవాల్సిందే. మన కారుముందు బానెట్ పై పార్టీ జెండా రెపరెపలాడాల్సిందే. కారు అద్దానికి పార్టీ స్టిక్కరు అతికించాల్సిందే. ఇళ్ళల్లో పెళ్ళో, చావో జరిగితే పార్టీ జెండాలు కట్టాల్సిందే. పెళ్ళిబరాత్‌లో పార్టీ జెండాలు పట్టి కార్యకర్తలు ఊగిపోవాల్సిందే. మెడలో పార్టీ కండువాలు వేసుకున్నవారితో పెళ్ళి పందిరి నిండిపోవాల్సిందే.

పార్టీ నాయకుల, కార్యకర్తల, సానుభూతిపరుల పెళ్ళిళ్ళకు ఆ పార్టీ నాయకుడో, అధికారంలో ఉంటే ముఖ్యమంత్రో వస్తే నిజానికి సామాన్యులకు చాలా అసౌకర్యంగా ఉంటుంది. ఆత్మాభిమానమున్నవారికి చాలా అవమానంగా కూడా ఉంటుంది. సంకల్పం చెప్పి దేవతలను ఆహ్వానించిన పరమ పవిత్ర కల్యాణవేదిక మీదికి బ్లాక్ క్యాట్- నల్ల పిల్లులబీ వైట్ డాగ్- తెల్ల కుక్కలుబీ బాంబ్ స్క్వాడ్- కొండముచ్చులుబీ స్నిప్పర్ స్క్వాడ్ గ్రామసింహాలు వచ్చి అపవిత్రం చేసి వెళుతున్నా కల్యాణమంత్రాలను సంప్రదాయానికి విరుద్ధంగా మధ్యలో ఆపుతున్నా.. ఎవరికీ పట్టింపు ఉండదు. ఆ నాయకుడు వచ్చి వెళ్ళాక అక్కడంతా చెల్లాచెదురై పచ్చని పందిట్లో వెచ్చని నిట్టూర్పులు, నిరసనలు ఎవరికీ వినపడవు. కనపడవు. ఇలాంటిచోట్ల చాలాసార్లు పెళ్ళి పార్టీకి జరుగుతోందో, మనుషులకు జరుగుతోందో సామాన్యులకు అర్థం కాదు. అర్థమయ్యేలోపు పురోహితుడిని పక్కకు లాగేసి నాయకుడు/నాయకురాలు వచ్చి పౌరోహిత్యం చేసి తాళి కట్టించేసి ఆశీర్వదించి ఫోటోలు, వీడియోలకు ఫోజులిచ్చి తాళిని ఎగతాళి చేసి వెళ్ళిపోతూ ఉంటాడు/ఉంటుంది.



## స్వల్ప విషయంలో నిలిచిన ఐపీఎస్ పెళ్లి

- తెలంగాణ మాజీ ఎమ్మెల్యే కుమార్తెతో ఐపీఎస్‌కు పెళ్లి నిశ్చయం
- కాంగ్రెస్ జెండాలతో ర్యాలీగా వెళ్లాలని పట్టుబట్టిన పెళ్లి కుమార్తె బంధువులు
- ససేమిరా అన్న ఐపీఎస్
- ముదిరిన వివాదం.. నిలిచిన పెళ్లి

Courtesy: Andhra Jyothi

గుంటూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్వల్ప విషయంలో తలెత్తిన వివాదంతో ఓ ఐపీఎస్ పెళ్లి కి బ్రేక్ పడింది. పెళ్లి కుమారుడు ఐపీఎస్ అధికారి కాగా పెళ్లి కుమార్తె డాక్టర్. వివరాల్లోకి వెళ్తే నగరానికి చెందిన యువకుడు గుజరాత్ క్యాడర్ ఐపీఎస్ అధికారిగా ఎంపికయ్యారు. ఆయన ప్రొబెషనరీ పీరియడ్ పూర్తి చేసుకొని అక్కడ ఓ జిల్లాకు ఎస్పీగా ఇటీవలే నియమితులయ్యారు. ఆయనకు తెలంగాణలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే కుమార్తె అయిన డాక్టర్‌తో వివాహం నిశ్చయించారు. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల 30 నిమిషాలకు డాన్ బాస్కోలో వివాహం జరగాల్సి ఉంది. రాత్రికి శ్రీ కన్వెన్షన్‌లో విందు ఏర్పాటు చేశారు. మరి కొద్ది సేపట్లో పెళ్లి తంతు ప్రారంభం కావలసిన సమయంలో తెలంగాణ ప్రాంతం నుండి వచ్చిన పెళ్లి కుమార్తె తరపు బంధువులు పెద్ద సంఖ్యలో పట్టాభిపురం మెయిన్ రోడ్డుపై జూట్‌మిల్లు సమీపంలో ఉన్న ఐపీఎస్ అధికారి ఇంటి వద్దకు వెళ్లారు. తెలంగాణలోని తమ సంప్రదాయం ప్రకారం ఇరువురిని ఇంటి వద నుంచి డాన్ బాస్కో వరకు కారులో కాంగ్రెస్ పార్టీ జెండాలతో ఊరేగింపుగా తీసుకు వెళ్లాలని పట్టుబట్టారు. అందుకు పెళ్లి కుమారుడు ఐపీఎస్ అధికారి కావడంతో ససేమిరా అన్నారు. దీంతో ఈ విషయం ఇరు వర్గాల మధ్య పంతానికి దారి తీసింది. చివరకు సున్నితమైన అంశం వివాదాస్పదంగా మారడంతో బ్రేక్ పడింది. పెళ్లి కుమార్తె తండ్రి తెలంగాణకు చెందిన మాజీ ఎమ్మెల్యే. ఆయన ఏఐసీసీలో కీలకంగా వ్యవహరిస్తుండటంతో తొలుత సంప్రదింపులు ద్వారా సమస్య పరిష్కారానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో మాజీ ఎమ్మెల్యే బంధువులు, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పెళ్లి కుమారుడు ఇంటి వద్ద హడావిడి చేశారు. దీంతో పెళ్లి కుమారుడు ఐపీఎస్ అధికారి కావడంతో పోలీసులు అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో పెద్ద సంఖ్యలో పోలీస్ అధికారులు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి చోటుచేసుకుంది. ఇంతలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, సుంకర పద్మశ్రీ లతోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ఐపీఎస్ అధికారి ఇంటికి వెళ్లి ఆయనతో కుటుంబ సభ్యులతో చర్చలు జరిపారు. పీటల మీద పెళ్లి నిలిచిపోయిందని తెలియడంతో పెళ్లి కుమార్తె తల్లి గుండెపోటుతో ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. పెళ్లికి ఐపీఎస్ అధికారి కుటుంబ సభ్యులు విముఖత చూపుతుండటంతో వారిని ఒప్పించేందుకు కాంగ్రెస్ నాయకులు ప్రయత్నాలు చేశారు. అర్ధరాత్రి వరకు చర్చలు జరిపారు. మరోవైపు పెళ్లికి వచ్చిన సుమారు వందల మంది పెళ్లి కుమారుడి ఇంటి బయటే మోహరించారు. పెళ్లి కుమారుడు తరపున ఆయన బంధువైన ఫాదర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో చర్చలు జరిపారు. అర్ధరాత్రి దాటినా చర్చలు ఓ కొలిక్కి రాలేదని సమాచారం.

సిద్ధాంతం ఎప్పుడూ గందరగోళంగా అనిపిస్తుంది. ఉదాహరణలతో చెప్తేనే సిద్ధాంతం బలంగా నాటుకుంటుంది. సరిగ్గా అర్థమవుతుంది. "పెళ్ళిలో పార్టీ జెండా సిద్ధాంతం" స్పష్టంగా అర్థం చేసుకోవడానికి ఉపకరించే యథార్థ సంఘటన ఇది. చిత్తగించండి.

తెలంగాణాలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక మాజీ ఎమ్మెల్యే. ఆయన కూతురు డాక్టర్. గుజరాత్‌లో పోస్టింగ్ పొందిన హైదరాబాద్ నగరానికి చెందిన ఐపిఎస్ అధికారితో పెళ్ళి నిశ్చయమయ్యింది. పెద్దలు కుదిర్చిన పెళ్ళి. మరి కాసేపట్లో ముహూర్తం. పెళ్ళి కొడుకు ఇంటినుండి ర్యాలీగా మంటపానికి బయలుదేరాలని అమ్మాయి తరుపువారికి అనిపించింది. ర్యాలీ అంటే రాజకీయపక్షులకు జెండాలు ఉండాల్సిందే కదా! దాంతో కాంగ్రెస్ జెండాలు చేతపట్టుకున్నారు. "ఒరేయ్ నాయనా! మనం రాహుల్ గాంధీ పబ్లిక్ మీటింగ్‌కు ర్యాలీగా వెళ్ళడం లేదు. ఇది నా పెళ్ళి. పైగా నేను ఐపిఎస్ అధికారిని. రేపు నలుగురిముందూ నేను తలెత్తుకుని తిరగలేను. ఇది పద్ధతి కాదు. మర్యాద కాదు. సంప్రదాయం కాదు. అగౌరవం. అసందర్భం. చేతిలో ఆ జెండాలు, మెడలో ఆ కండువాలు తీసేయండిరా!"- అని ప్రాధేయపడ్డాడు పెళ్ళి కొడుకు. వింటే వారు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎలా అవుతారు? వినలేదు. అబ్బాయి కదల్లేదు. పెళ్ళి ఆగిపోయింది. పెళ్ళికూతురి తండ్రి కాంగ్రెస్ కండువారహితంగా పరుగు పరుగున వచ్చి అబ్బాయిని ఒప్పించడానికి ప్రయత్నించాడు. కానీ కాంగ్రెస్ చేతులు కాలాక ఆకులు పట్టుకుని ప్రయోజనం లేదని ఆ పెళ్ళికొడుకు దెబ్బతిన్న మనోభావాలతో తృటిలో మామ కాలేకపోయిన ఆ నాయకుడికి స్పష్టంగా చెప్పాడు. నెత్తిన కాంగ్రెస్ గుడ్డ వేసుకుని వైరాగ్యంతో ఆ మాజీ ఎమ్మెల్యే తిరుగు ముఖం పట్టాడు.

(కడపటి వార్తలందే సరికి ఇంకా రాజీ ప్రయత్నాలు, బుజ్జగింపులు, ప్రాధేయపడడాలు, క్షమాపణలు, వేడుకోళ్ళు జరుగుతూనే ఉన్నాయి కానీ బీటలువారిన పెళ్ళికొడుకు మనోభావాలు అతుక్కోలేదని తెలిసింది. ఒకవేళ అతుక్కుని అతడు పెళ్ళి పీటలు ఎక్కి ఉంటే సంతోషం)

**ఫలశ్రుతి:-**

**మీ రాజకీయ పార్టీల క్రియాశీలక భాగస్వామ్య ప్రదర్శనకు భావి జీవిత భాగస్వాములు కావాల్సినవారిని బలిపెట్టకండి. లేదా బరాత్ లో వెయ్యి పార్టీ జెండాలు, పెళ్ళిలో రెండు వేల పార్టీ హోర్డింగ్స్, రిసెప్షన్లో మూడువేల పార్టీ స్లోగన్ బిల్ బోర్డ్స్, అప్పగింతలవేళ నాలుగువేల పార్టీ మ్యానిఫెస్టో కాపీలు, శోభనానికి అయిదువేలమంది పార్టీ కార్యకర్తల తోడు ఉంటారని ముందే ఒక మాట అనుకోండి!**

-పమిడికాల్వ మధుసూదన్



**TO LET**
**2BHK HOUSE**
**FULLY FURNISHED**
LBS COLONY, SRIKAKULAM
94401 95559, 99881 95559



**FOR SALE**
**3BHK FLAT 2025 SFT WITH CUPBOARDS, INDIVIDUAL PRESSURE MOTOR , 4 WASHROOMS**
KATTA'S SURYA PRIDE
LBS COLONY SRIKAKULAM.
94401 95559, 99881 95559


## పెనుగొండకు కేంద్ర అవార్డు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ప్రముఖ రచయిత పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ప్రకటించడం పట్ల వివిధ సాహితీ, సాంస్కృతిక సంస్థలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ మేరకు గురువారం విడుదల చేసిన ప్రకటనలో అభ్యుదయ సాహిత్య రంగంలో పెనుగొండ కృషిని గుర్తు చేసుకున్నాయి. 2023లో అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్ష పదవికి ఎంపికైన తొలి తెలుగు సాహితీవేత్తగా ఆయన చరిత్ర సృష్టించారని ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు గుర్తు చేశారు. అభ్యుదయ రచయితల ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న పెనుగొండ దారిలో కలిసి నడిచే అవకాశం రావడం ఆనందంగా ఉందని అరసం రాష్ట్ర అధ్యక్షవర్గం సభ్యులు నల్లి ధర్మారావు తెలిపారు. వీరితోపాటు అరసం జిల్లా కార్యదర్శి చింతాడ కృష్ణారావు, ఇస్కఫ్ జిల్లా అధ్యక్షులు కార్యదర్శి ఎంవి మల్లేశ్వర రావు. జీవి నాగభూషణ్. తెరవే అధ్యక్ష కార్యదర్శులు ఉత్తరావళి నాగేశ్వరరావు ఆర్ వి రమణమూర్తి వర్షం వ్యక్తం చేశారు.

## హోంగార్డు కుటుంబానికి ప్రమాద బీమా అందజేత



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విధి నిర్వహణలో భాగంగా ప్రమాదవశాత్తు మరణించిన హోంగార్డు కాంతారావు కుటుంబానికి యాక్సిస్‌బ్యాంకు అందించే ప్రమాదం బీమా నగదు రూ.34 లక్షల చెక్కును గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి చేతుల మీదుగా కాంతారావు సతీమణి లక్ష్మి, కుటుంబసభ్యులకు అందించారు. యాక్సిస్ బ్యాంకు వారు పోలీసు, హోంగార్డుల నెలవారి సాలరీ ఖాతా యాక్సిస్ బ్యాంకులో ఉన్నవారు ప్రమాదవశాతు చనిపోతే వారి కుటుంబానికి ప్రమాదబీమా కింద రూ.30 లక్షలు, వారి పిల్లల చదువుల నిమిత్తం పిల్లలు ఒకొక్కరికి రూ.4 లక్షల చొప్పున ప్రమాద బీమా సౌకర్యం కల్పించారు. జిల్లా పోలీసు శాఖ, హోంగార్డు విభాగానికి సంబంధించిన టి.కాంతారావు ఆగస్టు నెలలో ప్రమాదవశాత్తు మరణించడంతో వారి కుటుంబానికి ప్రమాద బీమా నగదు రూ.34 లక్షల నగదు చెక్కును యాక్సిస్ బ్యాంకు వారు, జిల్లా ఎస్పీ వారి చేతుల మీదుగా కాంతారావు కుటుంబసభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డ్ కాంతారావు మరణించడం చాలా బాధాకరం అని అయినప్పటికీ ఆయన కుటుంబసభ్యులను, కుటుంబాన్ని ఎల్లవేళలా జిల్లా పోలీస్ శాఖ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. వచ్చిన ప్రమాద బీమా నగదు కుటుంబ అవసరాలు, పిల్లలు చదువు నిమిత్తం సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. తక్కువ కాలంలోనే ప్రమాదబీమా నగదు వచ్చేటట్లు చర్యలు తీసుకున్న బ్యాంకు అధికారులును జిల్లా ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కెవి రమణ, కార్యాలయం ఏఓ సీహెచ్ గోపినాథ్,యాక్సిస్ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ సిహెచ్ రమేష్, డిప్యూటీ మేనేజర్ ఎస్.బాలరాజు, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణునికి ఘనంగా పూజలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పుట్టినరోజును పురస్కరించుకుని స్థానిక 43వ డివిజన్ హయాతినగరంలో డివిజన్ ఇన్‌చార్జ్, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు తోనంగి వెంకన్న యాదవ్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ మందిరంములో ఘనంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు. సాయంత్రం మున్సిపల్ కాంట్రాక్టర్స్ ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షులు తొణంగి వెంకన్న యాదవ్ కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో టాక్టర్స్ గొర్ల రామానాయుడు, యల్ల రామారావు, బి.హరికృష్ణ, ఆర్.కామేష్, గంగరాజు, గణేష్, విజయ్, క్లోరిన్ రాజు తదితరులు పాల్గొన్నారు.



## జన్మదిన వేడుకలు విజయవంతం చేయండి

(సత్యంన్యూస్, టెక్కలి)



ఈనెల 21న టెక్కలిలో నిర్వహించనున్న మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కోరారు. టెక్కలి ఎమ్మెల్సీ కార్యాలయం అక్కువరం వద్ద ఉదయం తొమ్మిది గంటలనుండి వేడుకలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం రక్తదాన శిబిరం, అన్నదానం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, వైఎస్‌ఆర్సీపీ కుటుంబసభ్యులు,అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయండి

(సత్యంన్యూస్, టెక్కలి)

రోడ్డు పక్కన కూరగాయలు అమ్ముకునే నిరుపేదలు, తోపుడు బళ్ళతో ఉన్న వీధి విక్రయదారులకు రోడ్డు పక్కన నుండి తొలగించారని, వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని టెక్కలి తోపుడుబళ్ల కార్మికుల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈమేరకు గురువారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. చిన్న బజారులో ఉన్న ప్రస్తుతం చూపించినటువంటి స్థలము సరిపోదని, అలాగే పాత బస్టాండ్‌లో కూరగాయలు అమ్ముతున్న భవనానికి వెనుక ఒక లైన్ పండ్లుబళ్లుకు అవకాశం ఇమ్మని కోరారు. అలాగే పట్టుమాదేవి కోనేరు చెరువుగట్టు, మిగతా కొన్ని స్థలాలను ఆర్డీఓకి సూచించారు. అధికారులతో సంప్రదించి తగిన పరిష్కారం చూపిస్తానని ఆర్డీఓ చెప్పారన్నారు. అధికారులు కొలిచి ఇచ్చిన 5×5 స్థలం బండి కంటే తక్కువ పరిమాణంగా ఉందని, దీనిని గమనించి కొంతమందికి అక్కడ ఉంచి మరికొంతమందిని పాత బస్టాండ్‌లో వ్యాపారాలు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉర్జాన మాధవరావు, వరదరాజులు, తిరుపతి, చిన్నమ్మడు, సీత, మల్లి నీలవేణి, సీపీఎం నాయకులు కొల్లి యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఆర్టీసీలో ఆన్‌కాల్ డ్రైవర్లకు దరఖాస్తులు

(సత్యంన్యూస్ శ్రీకాకుళం)

శ్రీకాకుళం 1&2వ డిపోలలో ఆన్‌కాల్ డ్రైవర్లుగా పనిచేసేందుకు ఆసక్తి, అర్హత కలిగి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఆర్టీసీ శ్రీకాకుళం 1&2వ డిపో మేనేజర్లు అమరసింహుడు, కె.ఆర్.యస్.శర్మ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో డిసెంబరు, 24వ తేదీలోగా శ్రీకాకుళం 1&వ డిపోల కార్యాలయాలలో సంప్రదించాలని కోరారు. హెవీ లైసెన్స్ వచ్చి 18 నెలలు పూర్తవ్వాలని, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, బ్లడ్ గ్రూప్ సర్టిఫికెట్, జన్యూన్ సర్టిఫికెట్లతో, 9959225608, 9959225609, 7382921647, 7382917289లో సంప్రదించాలని కోరారు.


ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాల్ల కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
Near Surya Mahal Theatre
Women's College Road,
Srikakulam - 532 001

# కొంచెం తారు వాడండయ్యా!





నగరంలో సూర్యమహల్ జంక్షన్ నుంచి పసగాడ సూర్యనారాయణ మిల్లు జంక్షన్ వరకు ఉన్న ఆర్ అండ్ బి రోడ్డుకు జరుగుతున్న మరమ్మతులు ఒక్కసారి గమనించండి. తారు లేకుండా కూడా బీటీ రోడ్డు వేయొచ్చన్న కొత్త సాంకేతిక అందుబాటులోకి వచ్చిందేమోనన్న అనుమానం కలుగుతుంది. మరీ ముఖ్యంగా చిన్నమండలవీధి జంక్షన్ ఉమెన్స్‌కాలేజీ రోడ్డు వద్ద పదేసి మీటర్ల చొప్పున చేసిన ప్యాచ్‌వర్క్‌ను చూస్తే తారురోడ్ల టెక్నాలజీ మారిందనిపించకమానదు.

- రాత్రి వేసిన రోడ్డు తెల్లారికి తేలిపోయింది
- నాణ్యత లేని ప్యాచ్ వర్క్‌లు
- గతంలో గోతుల్లో బళ్లు గంతులేస్తే.. ఇప్పుడు స్కిడ్ అవుతున్నాయి
- ఇలాంటి పనులకు బిల్లులు ఎలా మంజూరుచేస్తారో?!
- అధికారులు కళ్లు మూసుకున్నారు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

హాట్‌మిక్సర్ టెక్నాలజీ వచ్చిన తర్వాత చిప్స్, తారును కలిపేసి దాన్ని రోడ్డు మీద పోసి రోలర్‌తో మట్టించడం, వెంటనే దాని మీద రాకపోకలు సాగించడం మొదలైంది. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత పెద్ద పెద్ద రాళ్లు గోతుల్లో వేసి, రోడ్డు పక్కన తారు డబ్బాలను మంటల మీద పెట్టి అడపాదడపా ప్యాచ్ వర్క్‌లు చేశారు. అటు హాట్‌మిక్సర్‌కు, ఇటు జగన్మోహన్‌రెడ్డి అనుసరించిన బండరాళ్ల విధానానికి పూర్తి భిన్నంగా నగరంలో సంబంధిత కాంట్రాక్టర్ ప్రవేశపెట్టారు. గతంలో గుంతలున్నచోట బళ్లు గంతులేసేవి. ఇప్పుడు గుంతలు కప్పినచోట బళ్లు స్కిడ్ అవుతున్నాయి. అంతే తేడా. ఇంకా చెప్పాలంటే గంతులు కంటే స్కిడ్ ప్రమాదకరం. కథనం పూర్తి వివరాల్లోకి వెళితే.. జగన్మోహన్‌రెడ్డి పాలనలో రోడ్లను ఏమాత్రం పట్టించుకోలేదని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పల్లెపండుగ పేరుతో ప్రతీ పంచాయతీకి రోడ్ల మరమ్మతు కోసం రూ.10 లక్షలు కేటాయించారు. అందులో భాగంగానే శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్‌కు కూడా రూ10 లక్షలు వచ్చాయి. అయితే పైన చెప్పుకున్న రహదారి రోడ్లు, భవనాల శాఖ పరిధిలోనిది. అంటే ఈ రూ.10లక్షలు ఖర్చు చేసి ఆర్ అండ్ బీ యే టెండర్లు పిలిచి గోతులు కప్పాలి. అయితే కార్పొరేషన్ అంటూ ఒకటుంది కాబట్టి.. ఆర్ అండ్ బి చేతిలో అనేక రోడ్లు ఉన్నాయి కాబట్టి ఈ రూ.10 లక్షలు ఖర్చుపెట్టి మున్సిపల్ యంత్రాంగమే టెండర్లు పిలిచి నగరంలో బీటీ రోడ్ల ప్యాచ్‌వర్క్‌లు పూర్తిచేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ భావించారు.









దీంతో కార్పొరేషనే రూ.10 లక్షల పనిని విజయ నగరానికి చెందిన ఒక కాంట్రాక్టర్‌కు అప్పగించింది. ఇంతవరకు ఒక లెక్క. ఇక్కడే అసలు కథ మొదలైంది. ప్యాచ్ వర్క్‌లకు సంబంధిత కాంట్రాక్టర్ కనీసం తారును వాడటంలేదు. హాట్‌మిక్సర్‌లో తారు, చిప్స్ కలిపి గుంతలు పూడ్చాల్సి ఉండగా, అందులో తారుశాతం పూర్తిగా తక్కువ ఉండటం వల్ల చిప్స్ తేలిపోతున్నాయి. ఎంతలా అంటే.. కనీసం తారు ఎక్కడుందో కనపడనంత. సాధారణంగా హాట్‌మిక్సర్ టెక్నాలజీలో రోడ్డు వేస్తే రోడ్డు ఒకవైపు పూర్తవు తుండగానే మరోవైపు ప్రయాణాలు సాగించవచ్చు. ఇక్కడ మాత్రం రాత్రిపూట రోడ్డు వేసినా ఉదయం చిప్స్ మీద వాహనాలు పోవడం ఇబ్బందికరంగా మారింది. నగరంలో ఈ రోడ్డు పనులను పలువురు విమర్శిస్తుండటంతో స్థానిక చిన్నమండలవీధి జంక్షన్ వద్ద పైకి తేలిపోయిన చిప్స్‌ను గురువారం ఏరుతున్నారు. ఉమెన్స్ కాలేజీ ఎదురుగా మాత్రం పైకి తేలిన చిప్స్‌ను ఏరితే పాత రోడ్డే దర్శనమిచ్చే అవకాశముంది. బీటీ ప్యాచ్‌వర్క్‌లను 25 ఎంఎం మందంలో వేయాల్సి ఉంది. కానీ అనేక చోట్ల 20 ఎంఎంలో మాత్రమే గోతులు పూడుస్తున్నారు. ఇక సూర్యమహల్ టూ పసగాడ సూర్యనారాయణ మిల్లు జంక్షన్ వరకు ఉన్న రోడ్డు ప్యాచ్‌వర్క్‌లలో 25 ఎంఎం మందం కనిపిస్తున్నా కనీసం తారు కనిపించకపోవడం విడ్డూరం. ప్రస్తుతం అక్కడక్కడ తారు, చిప్స్ మిక్సయినట్టు కనిపిస్తున్నా ఒక్క వర్షం పడితే ఈ బంధం బీటలు వారే ప్రమాదం ఉంది. ఇందుకు తారు తక్కువగా ఉండటమే. వాస్తవానికి వేడిగా మరుగుతున్న తారును ఇందుకు వాడాల్సి ఉంది. కానీ ప్లాంట్‌లో చల్లారిపోయిన తారును తీసుకు వచ్చి అందులో చిప్స్ వేయడం వల్ల రెండూ అతుక్కోవడంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇదే వర్క్ కింద స్థానిక పాలకొండ రోడ్డులో కొంత భాగంలో ప్యాచ్‌వర్క్‌లు చేసి, మరికొంత భాగాన్ని వదిలేశారు. ఆర్ అండ్ బి రోడ్డయినా మున్సిపాలిటీయే మరమ్మతు పనులు చేస్తుంది కాబట్టి దాన్ని పర్యవేక్షించాల్సిన బాధ్యత కూడా మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులదే. ఈ రోడ్డులో స్కూల్స్, కాలేజీలు ఉండటం వల్ల విద్యార్థులు ప్రయాణిస్తుంటారు. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లలను వారి వాహనాలపై దిగబెడుతుంటారు. రోడ్డు పనుల నాణ్యతలోపం పుణ్యమాని నడిపించి తీసుకెళ్లే పరిస్థితి ఏర్పడింది. ఈ పనులకు ముందు రోడ్లను శుభ్రం చేసే మిషిన్ రోజూ ఈ రోడ్డును ఊడ్చేది. అయితే ఇప్పుడు మిషన్ కాదు కదా మనుషులు ఊడ్చడానికి కూడా పనికిరాకుండాపోయింది. ఈ రోడ్డు పూర్తిగా రాళ్లు తేలిపోయింది. ఏ కాంట్రాక్టర్ ఈ పనులు చేపడుతు న్నారో, అధికారులకు ఎంత ముట్టిందో తెలియదుగాని ప్యాచ్‌వర్క్ పూర్తిగా ఫెయిలైంది. పనులు చూసి బిల్లు మంజూరు చేస్తారో, ఇప్పటికే మంజూరు చేసేశారో, లేక ఆమ్యామ్యాలు తీసుకుని కళ్లు మూసుకుని బిల్లు ఇచ్చేస్తారో. ఊర్లోకొచ్చిన ప్రతీసారి ఎమ్మెల్యే అర్జీలు స్వీకరించడం, నేను ఖాళీ, మా ఆఫీసుకు వచ్చేవారు రండి అని చెప్పడమే తప్ప.. ఇటువంటి పనులపై దృష్టి సారిస్తున్నారో లేదో. అయినా ఈ రోడ్డులో ప్రయాణిస్తున్నప్పుడు అధికారులు, నాయకులకు నల్ల అద్దాల కారులో వెళ్తే ఏం కనిపిస్తాయిలెండి.



## 'ఐకాన్' ఉచిత వైద్య శిబిరం





(సత్యంన్యూస్, ఆమదాలవలస)

ఆమదాలవలస బ్రిడ్జి డౌన్‌లోని ఐకాన్ హాస్పిటల్ డాక్టర్ సీపాన హేమమోహనరావు ఆధ్వర్యంలో ఐకాన్ హాస్పిటల్, కిమ్స్ హాస్పిటల్ సంయుక్తంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఉచితంగా రూ.5 వేలు విలువైన గుండె పరీక్షలు, ఈసీజీ, 2డి ఎకో, షుగర్ పరీక్షలు, ఎముకుల సాంద్రత నిర్ధారణ పరీక్షలు(బీఎండీ) ఉచితంగా చేశారు. ఐకాన్ హాస్పిటల్ వైద్యులు సీపాన హేమమోహనరావు, కిమ్స్ వైద్య నిపుణులు 259 మందికి వైద్యసేవలు అందించి ఉచితంగా మందు లు అందించారు. ఏడుగురికి గుండెకు సంబంధించిన సమస్యలు గుర్తించి వారికి కిమ్స్ హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. ఎముకుల సాంద్రత పరీక్షల్లో 56మందికి ఆస్టియోపీనియస్ డిసీజ్, 32మందికి ఆస్టియో పోరోసిస్ ఉన్నట్లు గుర్తించి మందులు అందించారు. వైద్య శిబిరంలో ఐకాన్ హాస్పిటల్ టీమ్ ఎ.శ్రీనివాస్, కె.శ్రీలత, శివాని, శ్రీలత, మోహిని, కిమ్స్ హాస్పిటల్ టీమ్ పాల్గొన్నారు.

## డిస్టెన్స్ డిగ్రీ విద్యార్థులకు 21 నుంచి క్లాసులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఆంధ్రా యూనివర్సిటీ సెంటర్ ఫర్ డిస్టెన్స్ & ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ 2024 విద్యాసంవత్సరానికి సంబంధించి ఈ నెల 21 నుంచి క్లాసులు ప్రారంభం కానున్నట్టు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాంలలో మొదటి, రెండో సెమిస్టర్ వారాంతపు తరగతులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగు తాయని, దీనికి హాజరయ్యే విద్యార్థులు గుర్తింపు కార్డును తీసుకు వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆమె ఆ ప్రకటనలో కోరారు.

# జిల్లాలో 15వేల వరకు పింఛన్లు పోతాయ్!







- నకిలీ సదరం సర్టిఫికెట్‌లే ఇందుకు కారణం
- ఇప్పటికే పూర్తయిన ర్యాండమ్ చెక్
- ఒంటరి మహిళలు, డప్పు కళాకారుల ధ్రువీకరణలోనూ తప్పులు దొర్లాయి





సత్యంన్యూస్, శ్రీకాకుళం

పింఛన్ల ఏరివేతపై కూటమి ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంది. వైకాపా ప్రభుత్వ హయాంలో అనర్హులకు పింఛన్లు ఇచ్చారని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫిర్యాదు అధిక సంఖ్యలో వచ్చాయి. దీంతో ప్రభుత్వం ర్యాండమ్‌గా పింఛన్లు తనిఖీ చేయాలని నిర్ణయించి జిల్లాకు ఒక వార్డు, గ్రామ సచివాయం పరిధిలో పింఛన్లు తనిఖీ పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో 26 వార్డు/గ్రామ సచివాలయాల పరిధిలో అన్ని కేటగిరీల్లో 10,958 మంది పింఛన్లను తనిఖీ చేస్తే, అందులో 563 మంది అనర్హులుగా గుర్తించారు. వీరి పింఛన్లపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వాళ్ల పెన్షన్లను కట్ చేయాలని డిసైడ్ అయింది. ఈ మేరకు వారికి నోటీసుల జారీకి సిద్ధమైంది. ఈ నోటీసులను గ్రామ, వార్డు సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ ద్వారా జారీ చేయడానికి సన్నద్ధమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటికి రాష్ట్రంలో సుమారు 65 లక్షల సామాజిక భరోసా పింఛన్లు ఇస్తున్నారు. గడిచిన ఆరు నెలల్లో ఈ సంఖ్య 63.92 లక్షలకు తగ్గింది. ఈ లెక్కన 1.56 లక్షల మందికి పింఛన్లు నిలిచిపోయినట్టు సెర్ప్ విడుదల చేస్తున్న ప్రకటన ద్వారా స్పష్టమవుతుంది. ఈ నెల మొదటి వారంలో రాష్ట్రవ్యాప్తంగా పైలెట్ ప్రాజెక్ట్ కింద అన్ని రకాల పింఛన్లను తనిఖీ చేశారు. జిల్లాల్లో తనిఖీ చేసిన ఎచ్చెర్ల మండలం సంతసీతారాంపురం సచివాలయం పరిధిలో అనర్హులు పింఛన్లు తీసుకుంటున్నట్లు గుర్తించారు. అలాంటి పింఛన్లు కట్ చేయాలని ఏపీ సర్కారు డిసైడ్ అయింది.

### దివ్యాంగుల్లో అనర్హులే అధికం

అర్హత లేకపోయినా పింఛన్లు తీసుకుంటున్న వారికి ముందుగా నోటీసులు జారీ చేయాలని నిర్ణయించినా పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి తనిఖీ చేసిన పింఛన్లలో 5 శాతం అనర్హులు ఉన్నట్టు తేలింది. జిల్లాలో అనర్హులు పింఛన్లు తీసుకుంటున్నారని గ్రీవెన్స్‌లో అనేక ఫిర్యాదులు రావడం, అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంతో ఇన్నాళ్లూ అనర్హులు పింఛన్లు పొందుతూ వచ్చారు. సదరం ధ్రువీకరణతో దివ్యాంగుల పింఛన్లు పొందుతున్నవారు జిల్లాలో 31,997 మంది ఉన్నారు. వీరిలో అనర్హులు 10 శాతానికి మించి ఉంటారన్న అభిప్రాయం అధికారుల్లో ఉంది.

- కోటబొమ్మాళి మండలం దంత సచివాలయం పరిధిలో 484 మంది వివిధ కేటగిరీల్లో పింఛన్లు పొందుతున్నారు. వీరిలో 78 మంది దివ్యాంగుల ఉండగా, అందులో 56 మంది అనర్హులుగా కలెక్టర్ ఆదేశాలతో నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో గుర్తించారు.
- ఎచ్చెర్ల మండలం ఇబ్రహీంబాద్‌లో దివ్యాంగుల పింఛన్లు పొందుతున్నవారిలో అనర్హులు 12 మంది ఉన్నారని ఫిర్యాదు రాగా, అందులో 8 మందిని తొలగించారు.

ఇలా జిల్లావ్యాప్తంగా వందల్లో అనర్హులు ఉంటారన్న వాదన బలంగా వినిపిస్తుంది. దీంతో ఇటీవల కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో అన్ని కేటగిరీల్లో పింఛన్లు తనిఖీచేసి మూడు నెలల్లో అనర్హులను పూర్తి స్థాయిలో తొలగించాలని ఆదేశించారు. దీంతోపాటు దివ్యాంగుల పింఛన్లపై ప్రత్యేక వైద్య సిబ్బందితో వైకల్య నిర్ధారణ చేసి అనర్హులను ఏరివేయాలని ఆదేశించారు.

### 17 మంది అనర్హులు గుర్తింపు

జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ఎచ్చెర్ల మండలం సంతసీతారాంపురం సచివాలయం పరిధిలో బలిజిపేట, నందిగాం, చిన్నరావుపల్లి గ్రామాలు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ లెక్క ప్రకారం 482 మంది వివిధ కేటగిరీల్లో పింఛన్లు తీసుకుంటున్నారు. వీటిని పక్క మండలానికి చెందిన సచివాలయం సిబ్బంది ఎచ్చెర్ల ఎంపీడీవో ఆధ్వర్యంలో తనిఖీలు చేసి ప్రభుత్వం నిర్దేశించిన యాప్‌లో వివరాలను అప్‌లోడ్ చేశారు. అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు 17 మంది అనర్హులుగా తేలారు. వీరిలో ఎక్కువ మంది ఒంటరి మహిళ పింఛన్లు పొందుతున్నవారే ఉన్నట్టు గుర్తించారు. వీరితో పాటు డప్పు కళాకారుల పేరుతో పింఛన్లు పొందుతున్నవారూ ఉన్నారని తెలిసింది. అనర్హులని అనుమానం కలిగినవారితో తనిఖీ సమయంలోనే కలెక్టర్ స్వప్నిల్ దినకర్ మాట్లాడి నేరుగా వివరణ కోరినట్టు తెలిసింది. దివ్యాంగ పింఛన్లు పొందుతున్నవారిలో ర్యాండమ్‌గా ఇద్దరితో కలెక్టర్ మాట్లాడినట్టు తెలిసింది. వృద్ధాప్య పింఛన్ల విషయంలో వంద శాతం జెన్యూనిటీ ఉందని అధికారులు చెబుతున్నారు. మిగతా కేటగిరీల్లో 1-5 శాతం వరకు అనర్హులు ఉండే అవకాశం ఉందని అధికారులు లెక్కగడుతున్నారు. ఈ లెక్కన జిల్లాలో ఈ నెల ఒకటికి ఉన్న మొత్తం 3,13,255 పింఛన్లలో 96 శాతం మందికి మాత్రమే పంపిణీ చేశారు. నవంబర్‌లో 3,14,385 మందితో పోలిస్తే డిసెంబర్ నాటికి సుమారు 950 మంది తగ్గారు.

### భారీగా కోత తప్పదు

అనర్హుల ఏరివేత పూర్తిస్థాయిలో ప్రారంభమైతే జిల్లాలో సుమారు 12 నుంచి 15 వేలు వరకు తొలగించే అవకాశం ఉందని చర్చ సాగుతుంది. వీటన్నింటినీ మార్చి నాటికి తొలగించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. వీరందికీ నోటీసులు ఇచ్చి వారి నుంచి వివరణ తీసుకోనున్నారు. ఆ తర్వాత లబ్ధిదారుల వివరణలో వాస్తవం ఉంటే పింఛన్ కొనసాగిస్తారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, గ్రామ/వార్డు సచివాలయాల కార్యదర్శులకు సర్కారు నుంచి సూచనలు రానున్నాయి.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.